www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 1 ఫిబ్రవరి 2023

5

కాకినాడ



10 నుంచి12 వరకు ప్రజ్ఞ - వికాస పరీక్ష



పాఠశాలలో ప్రచారం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10, 11, 12 తేదీలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించనున్న ప్రజ్ఞ-వికాస పరీక్షను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వ హించారు. పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఈ వికాస పరీక్ష పై ప్రచారం నిర్వహించారు. విద్యార్థులందరూ ఈ పరీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పంచికట్ల సతీష్,బోట్టా చైతన్య,తాళబత్తుల రవి విజ్ఞప్తి చేశారు.

కేంద్రం కనికరిస్తేనే..!

- విభజన హామీలను విస్మరిస్తున్న కేంద్రం
- కానరాని 'కాకినాడ పెట్రో కెమికల్ కారిడార్'
- 'భారతమాల' ప్రాజెక్టుపై నీలి నీడలు
- కలగా కాకినాడ - పిఠాపురం రైల్వే మెయిన్ లైన్
- నేటి బడ్జెట్‌పై ఆశలతో జిల్లా వాసులు







ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి బీజేపీ ప్రభుత్వం ఏటా ప్రవేశ పెడుతున్న బడ్జెట్ కేటాయింపుల్లో ఏపీపై వివక్ష ప్రదర్శిస్తోంది. కాకినాడ పెట్రో కెమికల్ కారిడార్ సహా, జిల్లా అభివృద్ధికి అత్యంత అవసరమైన కీలక ప్రాజెక్టులను సైతం విస్మరిస్తుంది.దానిలో భాగంగానే భారతమాల' ప్రాజెక్టు పనులు ముందుకు కదలలేదు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బుధవారం ప్రవేశ పెడుతున్న కేంద్ర బడ్జెట్ లో ఈసారైనా న్యాయం జరుగుతుందా అన్న ఆశతో జిల్లా వాసులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

అతీగతీ లేని రూ.25 వేల కోట్ల ప్రాజెక్టు

కాకినాడలో పెట్రో కెమికల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనలో భాగంగా హామీ ఇచ్చింది. 2017 జనవరిలో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌పీసీఎల్- గెయిల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. రూ.25 వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించాలని భావించి కాకినాడ సెజ్‌లో సుమారు 2వేల ఎకరాలను కేటాయించారు.దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 50 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాలకులు చెప్పుకొచ్చారు. కార్పొరేట్‌తోపాటు ఇతర పన్నుల కింద వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) విషయంపై నేటికీ ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ప్రాజెక్టు ఏర్పాటుపై అతీగతీ లేకుండా పోయింది.

సాకారం కాని 'భారతమాల'

2018లో భారతమాల ప్రాజెక్టు కింద వాకలపూడి నుంచి అన్నవరం వరకు 516 ఎఫ్ జాతీయ రహదారి మంజూరైనా నేటికీ టెండర్ల దశ కూడా పూర్తి కాలేదు. రూ.1327 కోట్ల అంచనా నిధులతో 40.23 కిలోమీటర్ల పొడవున నాలుగు లైన్ల రహదారిని నిర్మించాలని భావించారు. భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుంది. 39 ఎకరాలు ప్రభుత్వ భూమి,382 ఎకరాలు ప్రైవేటు భూమి మొత్తంగా 421 ఎకరాలను సేకరిస్తున్నారు. ప్రైవేటు భూసేకరణకు రూ .204 కోట్లు అవసరమని రాష్ట్రం కేంద్రానికి ప్రతిపాదనను పంపినా ఇప్పటికీ నిధులు మంజూరు కాకపోవడం శోచనీయం. ఎప్పటికి మంజూరు చేస్తోందో స్పష్టత లేదు.

చిరకాల వాంఛకు పరిష్కారం లభించేనా..

కాకినాడ పోర్టు- పిఠాపురం రైల్వే మెయిన్ లైన్ అనుసంధానం చేయాలని అనేక ఏళ్లుగా జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం కేంద్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.అయితే 1998లో రూ.240 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా ఆచరణ సాధ్యం కాలేదు. కాకినాడ మార్గాన్ని మెయిన్ లైన్‌లో కలపాలని, లేదా విశాఖపట్నం విజయ వాడ మధ్య నిర్మించనున్న మూడవ లైన్లో నైనా కలిపేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ వంగా గీత కేంద్రాన్ని కోరుతున్నారు. ఈ సమస్యకు గనుక పరిష్కార లభిస్తే కాకినాడ వాసుల దశాబ్దాల కల నెరవేరుతుంది. కాకినాడ రైల్వే స్టేషన్‌ను మెయిన్‌లైన్‌లో విలీనం చేస్తే సికింద్రాబాద్, విజయవాడ, వాల్తేర్ (విశాఖపట్నం) రైల్వేస్టేషన్ల మాదిరిగా కాకినాడ సైతం రైల్వే పరంగా అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుంది.

పూర్తి కాని పోలవరం ఎడమ కాలువ పనులు

అతిపెద్ద భారీ ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి కాకపోవడంతో కాకినాడ జిల్లాలో మెట్ట రైతులకు శాపంగా మారింది. సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నిర్దేశించిన ప్రధాన ఎడమ కాలువ పనులు 15 ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. భూసేకరణలో తీవ్ర జాప్యం, నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం, పెండింగ్ బిల్లులు ఇలా అనేక కారణాల వలన కాలువ పనులు పూర్తికాలేదు. తుని, గొల్లప్రోలు, కిర్లంపూడి, జగ్గంపేట, ఏలేశ్వరం తదితర మండలాల పరిధిలో ఎడమ కాలువ విస్తరించి ఉంది. కేంద్రం స్పందించి పోలవరానికి నిధులు కేటాయిస్తేనే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.

స్మార్ట్ సిటీకి విడుదల కాని నిధులు

సుమారు రూ.1005 కోట్లతో కాకినాడ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేయాలని కేంద్రం భావించింది. అయితే ఇప్పటివరకు సుమారు రూ.600.47 కోట్లు మాత్రమే మంజూరు చేయగా 377.54 కోట్లు రావాల్సి ఉంది. 2017-16 లో స్మార్ట్ సిటీగా కాకినాడ ఎంపికవ్వగా 2019-20 కల్లా అభివృద్ధి పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదలలో తీవ్ర జాప్యం కారణంగా పనులు పడకేసాయి. మరోవైపు కొన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.



ఫైలేరియా నియంత్రణపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

10న ఫైలేరియా నివారణ మాత్రల పంపిణీ

- కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ ఫైలేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా నిర్మూలనకు ఫిబ్రవరి 10వ తేదీన పెద్దఎత్తున ప్రజలకు ఉచితంగా మాత్రలు పంపిణీ చేసి, వేయించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అధ్యక్షతన ఫైలేరియా నియంత్రణపై జిల్లా సమన్వయ కమిటీ (డీసీసీ) సమావేశం వర్చువల్‌గా జరిగింది. రెండేళ్లకు పైబడిన వారికి ఫైలేరియా నివారణ మాత్రలు (డై ఇథైల్ కార్బమెజైన్- డీఈసీ, ఆల్‌బెండజోల్) పంపిణీ చేసి, వేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం ఆవశ్యకతపై ప్రజలకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అవగాహన కల్పించి సమన్వయ శాఖల అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆయా శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వయసు ఆధారంగా ఇవ్వాల్సిన మాత్రలు, డోస్ తదితరాలపై, తిన్న తర్వాతే మాత్రలు వేసుకోవాల్సి ఉంటుందన్న విషయంపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. పంపిణీ రోజున పీహెచ్‌సీ స్థాయిలో వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశానికి జడ్‌పి సిఇఒ ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఎంహెచ్ఒ డాక్టర్ ఎం.శాంతిప్రభ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పీబీవీ విష్ణువర్ధిని, జిల్లా మలేరియా అధికారి ఎస్.భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ తదితరులు హాజరయ్యారు.

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేయాలి

ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం కలెక్టరేట్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.రోగులకు నగదు రహిత వైద్యం అందేలా చూడాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.శాంతి ప్రభ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పీబీవీ విష్ణువర్ధని, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.రాధాకష్ణ, జిల్లా మేనేజర్ కె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెద్దాపురం చేరుకున్న ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల ప్రచార జాతా



పెద్దాపురం చేరుకున్న ప్రచార జాతాలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ట్రాన్స్‌పోర్టు రంగ సమస్యలపై ఫిబ్రవరి 7న కాకినాడలో జరిగే జిల్లా సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రచార యాత్ర మంగళవారం పెద్దాపురం చేరుకుంది. మున్సిపల్ సెంటర్లోని స్నేహ ఆటోయూనియన్, స్నేహ టాటా మ్యాజిక్ స్టాండ్,వ్యాన్ స్టాండ్, లోడ్ ఆటో స్టాండ్‌ల వద్ద కార్మికులను ఉద్దేశించి సిఐటియు, ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు కొప్పిశెట్టి సత్తిబాబు, వాలిశెట్టి శ్రీనివాసరావు, కె.రాజా రమేష్‌లు ప్రసంగించారు. మోటారు వాహన సవరణ చట్టం 2020 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ ఆందోళనలో పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. ఈ నెల 7న కాకినాడలో జరిగే జిల్లా సదస్సులో మోటర్ కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పలివెల వీరబాబు, టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు కామరాజు, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి క్రాంతి కుమార్, నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

6వ తేదీన కోటనందూరులో 'స్పందన'

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రతి సోమవారం కాకినాడలో జరిగే స్పందన కార్యక్రమం ఈ నెల 6వ తేదీన సోమవారం మండల కేంద్రమైన కోటనందూరు ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యా లయం ఆవరణంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల ఆధ్వర్యంలో నిర్వహించ నున్నట్టు స్థానిక డిప్యూటీ తహశీల్దార్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన తెలిపారు. మండల పరిధిలో ఏ సమస్యలు ఉన్నప్పటికీ అర్జీలు సమర్పిసేత ఈ స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం లభిస్తుందని, ఈ అవకాశాన్ని పరిసర మండల, గ్రామాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏడిబి రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఈనెల ఒకటోతేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పెద్దాపురం ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్ 33/11 కె.వి పై విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాద్ తెలిపారు. దీనివల్ల ఏడిబి రోడ్, వాలు తిమామ్మపురం జంక్షన్, ఆర్‌బి కొత్తూరు అగ్రికల్చర్ లైన్, ఆర్.బి పట్నం జంక్షన్, ఏడిబి రోడ్డు రాజమండ్రి జంక్షన్,33 కెవిఎస్‌ఎస్‌ఎస్ ఫీడర్‌లపై విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెత్తను రోడ్లపై వేస్తే ఎలా

- కమిషనర్ రమేష్ అసహనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చెత్తను ఇలా రోడ్లపై వేస్తే ఎలా ? అంటూ కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన రామకృష్ణారావుపేట, ఆనందభారతి ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనేక చోట్ల చెత్త రోడ్లపై ఉండడాన్ని గుర్తించారు. ఇంటింటికి చెత్త సేకరణ కోసం ప్రత్యేక వాహనాలు, సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ చెత్తను వారికి ఇవ్వకుండా రోడ్లపై పడవేయటం సరికాదన్నారు. దీనివల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి, ప్రజారోగ్యానికి భంగకరంగా మారే పరిస్థితి నెలకొంటుం దన్నారు. ఈ విషయంలో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించాలని కమిషనర్ సూచిం చారు. కమిషనర్ వెంట కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డాక్టర్ పృధ్వీ చరణ్ ఉన్నారు.

కార్టూ'నిజం'



నకిలీదా..? చీకటిదా..? సార్..!

లే అవుట్లలో పనులు పూర్తికి ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్ఎ కురసాల కన్నబాబు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ గ్రామీణ నియోజకవర్గం నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించిన హౌసింగ్ లే ఔట్ పనులు, జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టిపెట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కాకినాడ గ్రామీణ నియోజకవర్గం గృహ నిర్మాణాలకు సంబంధించి నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణాలు, లేఔట్‌ల లెవెలింగ్, స్టోన్ ప్లాంటేషన్, అంతర్గత రహదారులు, కల్వర్టుల నిర్మాణం, ఎస్‌హెచ్‌జీ రుణాల మంజూరు తదితర అంశాలపై కలెక్టర్, రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబుతో కలిసి హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, డ్వామా తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు

కాకినాడ గ్రామీణ నియోజకవర్గం లబ్ధిదారులకు కేటాయించిన హౌసింగ్ లేఔట్ పనులు, జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టంచేశారు. ప్రధానంగా లేఅవుట్‌లలో ఇంకా మిగిలిన లెవెలింగ్, స్టోన్ ప్లాంటేషన్, అంతర్గత రహదారులు, కల్వర్టుల పనులు చేపట్టాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పనుల్లో పునాది దగ్గర నుంచి ఇంటి నిర్మాణం పూర్తయిన వరకు నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా క్షేత్రస్థాయి అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ గ్రామీణ నియోజక వర్గంలో నేమాం, పండూరు, తిమ్మాపురం, సూర్యారావుపేట, తూరంగి, కరప, అరట్లకట్ట తదితర గ్రామాల్లో సిద్ధం చేసిన లేఔట్లలో లబ్ధిదారులకు సుమారుగా 32వేల ఇంటి పట్టాలు పంపిణీ చేశామన్నారు. జగనన్న కాలనీలలో విద్యుత్ సరఫరా అందించేందుకు అవసర మైన స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు పూర్తయిన గృహాలకు వెంటనే తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఎల్ఎ కన్నబాబు సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, కాకినాడ డీఎల్‌డీవో పి.నారాయణ మూర్తి, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఎస్ఈలు, విద్యుత్, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప దీక్ష గోడ పత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన గన్నవరంలో చేపట్టిన సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ వర్మ గోడపత్రికను ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు కెవివి నగేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోటకూర రవి చక్రవర్తి మాట్లాడుతూ ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ గన్నవరం వద్ద చేపట్టిన సంకల్ప దీక్ష విజయవంతం కావాలని, దీక్షలో సిపిఎస్ ఉపాధ్యాయులు ఉద్యో గులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర వర్మ మాట్లాడుతూ వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎస్ కు ప్రత్యామ్నాయంగా జిపిఎస్ తీసుకురావడం చాలా అన్యాయమని పాత పెన్షన్ స్కీకు ఏదీ ప్రత్యామ్నాయం కాదని తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ ఏవిధమైనటువంటి హామీలు ఇవ్వని రాజస్థాన్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలు సిపిఎస్ రద్దుచేసే దిశగా ముందుకు అడుగులు వేస్తున్నాయ న్నారు. మన రాష్ట్రం కూడా సీపీఎస్ రద్దు చేసే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అందరు ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలుపుకుని పెద్ద ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు.

తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి రూ.10.5 కోట్లు

శత జయంతి వేడుకల్లో మంత్రి దాడిశెట్టి రాజా



ఆస్పత్రికి సేవలందించిన వారిని సన్మానిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కోటనందూరు

నాడు నేడు నిధుల నుంచి రూ.10.5 కోట్లు తుని ఏరియా ఆసుపత్రి అభివద్ధికి కేటాయించినట్లు రోడ్లు భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా ప్రకటించారు. తుని పట్టణంలో మంగళవారం జరిగిన తుని ఏరియా ఆసుపత్రి శత జయంతి వేడుకల్లో మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ1922 సంవత్సరంలో ఎస్ఆర్‌వివి సుభద్రయ్య ఆసుపత్రిని స్థాపించారన్నారు. అప్పటినుండి ఈ ఆసుపత్రి దశలవారీగా ఆధునికీకరిస్తూ వీరు జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలకు ప్రాణదానం చేసిన ఘనత ఈ ఆసుపత్రికి ఉందని అన్నారు. గతంలో ఎన్నడూ లేనంత విధంగా వైద్య రంగానికి అత్యధిక నిధులు కేటాయించి ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించి పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. ఈ ఆసుపత్రిలో రోగులకు గత మూడున్నర సంవత్సరాల కాలం రోగులకు ఉచితంగా భోజన సౌకర్యాలను అందిస్తున్నామన్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధికి సేవలందించిన పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ పెదపేట అమ్మాజీ, మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరు సుధారాణి బాలు పాల్గొన్నారు.

అర్హులందరికీ కొండపోడు భూముల పంపిణీ



కొండపోడు రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామారావు

ప్రజాశక్తి - కోటనందూరు

అర్హత కలిగిన లబ్ధిదారులకు అందరికీ కొండపోడు భూములను పంపిణీ చేస్తామని పెద్దాపురం ఆర్‌డిఒ సీతారామారావు అన్నారు. మంగళవారం కెఇ. చిన్నాయపాలెంలో ఉన్న కొండపోడులో జీడ మామిడి తోటలను సాగు చేస్తున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కోటనందూరు మండల పరిధిలో కెఇ.చిన్నపాలెం, కోటనందూరు, ఎస్ఆర్.పేట, కెఓ అగ్రహారం, ఇందుకుపల్లి, బోధవరం, తాటిపాక గ్రామాల్లో కొండపోడు భూములు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. వాటి సాగు చేస్తున్న రైతులకు భూములను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి రికార్డు ప్రకారంగా ఆ ఆ భూములను రైతులకు కేటాయించి, మిగిలిన భూములను అర్హత కలిగిన పేదలందరికీ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కోటనందూరు మండల పరిధిలో కొండపోడు భూముల కోసం 622 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని, వీరులో అర్హత ఉన్న వారందరికీ భూములు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట స్థానిక డిప్యూటీ తహహశీల్దార్ కిరణ్ కుమార్, సర్వేయరు తదితరులు పాల్గొన్నారు



శిక్షణ పూర్తయిన వాలంటీర్లకు కిట్లను పంపిణీ చేసిన టిపిఆర్ఒ కృష్ణమోహన్

ఆపదమిత్రల శిక్షణ పూర్తి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలగకుండా తీసుకోవలసిన రక్షణ చర్యలపై కాకినాడకు చెందిన 25 మంది వాలంటీర్లకు ఆపద మిత్ర శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లతో టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్ మంగళవారం నగరపాలక సంస్థ పాత భవనం వద్ద సమావేశమయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లు మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలిచేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన ప్రతి వాలంటీర్ ఒకొక్కరికి రూ.పదివేల విలువైన కిట్లను కూడా ప్రభుత్వ అందజేసినట్లు చెప్పారు. ఇందులో లైఫ్ జాకెట్ తో పాటు మరికొన్ని పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. శిక్షణలో నేర్చుకున్న వివరాలను, ప్రయోజనాలను మిగిలిన వలంటీర్లకు కూడా అర్థమయ్యేలా వివరించి ఉపద్రవాలు ఎదురైనప్పుడు సకాలంలో స్పందించేలా కషి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ఆరు బ్యాచ్‌లకు సామర్లకోట శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తయిందన్నారు. అనంతరం టిపిఆర్ఓ కష్ణ మోహన్ వాలంటీర్లకు సర్టిఫికెట్లను అందజేసి, కిట్‌లు వినియోగించే తీరుపై అవగాహన కల్పించారు.

బొగ్గవరపు సత్రం భూములను కాపాడండి

ప్రజాశక్తి - కాకినాడ

ఇటీవల కాకినాడ రూరల్ మండలంలో కోట్లాది రూపాయలు విలువైన బొగ్గవరపు సత్రం భూములు రాజకీయ అండదండలతో అన్యాక్రాంతం అవుతున్నట్టు పలు పత్రికల్లో వార్తలు రావడంతో దీనిపై సిపిఐ కాకినాడ జిల్లా కమిటీ బృందం తాటిపాక మధు, కె.రెడ్డి బోడకొండ, తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ, కోమర్తి శ్రీనివాస్ మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు కలెక్టర్‌కి వివరిస్తూ సర్పవరంలో 49/1 ఎకరం భూమిని దేవదాయ అధికారులు ఒక వ్యక్తికి అప్పనంగా అప్పజెప్పారన్నారు. 35 సర్వే నెంబరు రైతు వారి భూమితో పాటు బొగ్గవరపు సత్రం భూమి కూడా ఉందని ఆయన వివరించారు. కోట్లాది రూపాయలు విలువైన భూమిని చాలా చౌకగా రాజకీయ నాయకులు బినామీ పేరుతో కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ భూమి వ్యవహారాలపై ఆర్‌డిఒతో పూర్తిస్థాయి విచారణ చేయిస్తానని, దానికి అందరూ సహకరించాలన్నారు. అంతలో చాంబర్‌లోకి వచ్చిన రూరల్ ఎంఎల్ఎ కన్నబాబు మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్ర ఉందని దీనిపై ఒక నోటు తయారు చేశానని, త్వరలోనే మీ అందరి సమక్షంలో వివరిస్తానని ఆయన అన్నారు. నా నియోజకవర్గంలో ఒక అంగుళం భూమి కూడా కబ్జా కానివ్వనని హామీ ఇచ్చారు.

రోడ్లపై చెత్త వేయొద్దు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చెత్తను రోడ్ల పైన, డ్రైనేజీల్లోని వెయ్యొద్దని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన కాకినాడ ఏడో డివిజన్ రేచర్ల పేటలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు మాత్రమే చెత్తను అందజేయాలని స్పష్టం చేశారు. చెత్తను రోడ్లపైన డ్రైన్ లోను వేసే వారిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే జరిమానాలు కూడా విధిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట సచివాలయ, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడలో వీధులకు ప్రముఖుల పేర్లు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో కులాల పేర్లతో పలు వీధులు, పేటలు వాడుకలో ఉన్నందున తమ దృష్టికి వచ్చిన అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుని వాటికి ప్రముఖుల పేర్లతో నామ కరణం చేసినట్టు కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వెల్లడించారు. స్థానిక సూర్యారావుపేట కార్యాల యంలో మంగళ వారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల పేర్లతో దాదాపు 15 వీధులకు ఉన్నాయ న్నారు. గత డిసెంబరు 29న జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్ మోనటరింగ్ సమావేశంలో కులం పేరుతో వీధుల పేర్లు అధికారికంగా రికార్డులలో నమోదు కాబడి వాడుకలో ఉన్నాయని వాటి పేర్లు మార్చాలని వచ్చిన అభ్యంతరాలు దృష్టిలో పెట్టుకుని గుర్తింపు పొందిన ప్రముఖ వ్యక్తుల పేర్లు గుర్తించి కలెక్టర్ అనుమతులతో మార్చినట్టు తెలిపారు. కులాల పేర్లతో వీధుల పేర్లు ఉండరాదని కోర్టు ఆదేశాలను అనుసరించి ఈ మార్పు చేశామన్నారు. ఆయా వీధులు పేర్లు వివరించారు. జగన్నాధపురం రెల్లి వీధి- ప్రతిపాదిత పేరు శ్రీవడ్డి పోలమాంబ వీధిగా, మీసాల అనంతరావు వీధి, రజక వీధి-దుర్గాదేవి వీధి, కాపు వీధి-చామకూర నాగ బాబు వీధి, ఎస్.అచ్యుతాపురంలోని హరిజనపేట-డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వీధి, దేవాలయం వీధిలోని తెలుకుల వీధి-చంద్రపు స్వామి జియ్యారావు వీధి, సినిమా రోడ్డులోని కాబూలీ వీధి- ఆంజనేయస్వామి వీధి1,2., సూర్యనారాయణ పురం గొల్లల వీధి-కష్ణుని వీధి 1,2., రెల్లి వీధి-శబరి వీధి, బాలాజీ చెరువు రజక వీధి-నూకల రాధ వీధి, సాలిపేట-రావు గోపాలరావు వీధి, ప్రతాప్ నగర్ శెట్టిబలిజ వీధి-వాసంశెట్టి మధు వీధి, పోర్టు రైల్వే స్టేషన్ ఏరియా కాపులవీధి-ద్వారబంధాల చంద్రయ్య వీధిగా నామకరణం చేసినట్టు తెలిపారు. లోకేష్ పాదయాత్రకు అర్థం లేదన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉన్నపుడు పాదయాత్ర ఎందుకో లోకేష్ కే తెలియాల న్నారు. లోకేష్ పాదయాత్ర మనుగడ కోసమే తప్ప, ప్రజల కోసంకాదన్నారు. జగన్ కరోనా కష్టకాలంలో కూడా పథకాలు సంపూర్ణంగా ప్రజలకు అందించారని, పథకాలు పొందిన వారు పాదయాత్రలో, ఇదేమి ఖర్మ లో పాల్గొనవద్దని కోరారు. కార్యక్రమంలో కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్, వైసీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పసుపులేటి వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.



40వ డివిజన్‌లో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కొండబాబు

40వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సంక్షేమ పథకాలుకు రాజకీయాలకు ముడి పెట్టే హీనస్థితిలో వైసిపి నాయకులు ఉన్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. వైసిపి పాలనలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి ఇదేమి కర్మ మన కాకినాడకు కార్యక్రమంలో భాగంగా సోమవారం 40 డివిజన్‌లో కొండబాబు పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు రానివారు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న ఇదేమి ఖర్మ కార్యక్రమంలో పాల్గొంటున్నారని కాకినాడ ఎంఎల్ఎ ద్వారంపూడి వ్యాఖ్యానించడంపై ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందడం లేదని ఎంఎల్ఎ ఒప్పుకుంటున్నాడని, తెలుగుదేశం పార్టీ ఇదేమి ఖర్మ కార్యక్రమంలో పాల్గొనేవారు సంక్షేమ పథకాలు వదులుకుని తిరగాలని వాఖ్యానించడం ద్వారంపూడి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని, దోపిడి ద్వారంపూడి రెడ్డి దోచుకుంటున్న సొమ్ముని ఏమైనా సంక్షేమ పథకాలకు ఇస్తున్నాడా అని ప్రశ్నించారు. వైసీపీ దుర్మార్గ పాలనతో రాష్ట్ర ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని, అమ్మఒడితో ఇచ్చి నాన్నబుడ్డితో లాగేస్తున్నాడని, పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీయే తెలుగుదేశం పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో మల్లిపూడి వీరు, నెక్కంటి ఝాన్సీ రాణి, డివిజన్ నాయకులు మీసాల సునీత, సుందరపల్లి సత్తిబాబు, మీసాల మధు, జొన్నాడ వెంకటరమణ, మంతిన విజయరామరాజు, గంగుమళ్ల మురళిబాబు, సముద్రాల రమేష్, బిక్కిన కామేశ్వరరావు, ముత్యాల సూర్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ 7వ డివిజన్‌లో సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మదర్ థెరిస్సా విగ్రహం నుంచి నుంచి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ళపాలనలో ప్రభుత్వం అమలుచేసిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు ప్రభుత్వం పేరుతో మొక్కుబడి పర్యటనగా కాకుండా ప్రజలు చెప్పిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా ప్రతి సచివాలయ పరిధికి 20 లక్షల రూపాయలు చొప్పున నిధులు కేటాయించడం ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శన మన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మళ్ళీ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఆయన వెంట వైసిపి నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, అదనపు కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ ఫద్వీచరణ్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి ఉన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణఃమూర్తి అన్నారు.మంగళవారం పెద్దాపురం మండలం చదలాడ పంచాయతీ కార్యాల యంలో జరిగిన వినియోగదారుల చట్టాలపై జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు కొలతల్లో తేడాలు వచ్చినా,నాణ్యతలో తేడాలు వచ్చినా, మోసాలు జరిగినా, కల్తీలు జరిగినా ఈ చట్టం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. సంఘ సెక్రటరీ ఎం భాస్కరరావు,సభ్యులు కేవివి లక్ష్మి, సచివాలయ కార్యదర్శి బి ఈశ్వరరావు, వీఆర్వో పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలోని పలు రేషన్ దుకాణాలపై మంగళవారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి జి.చాముండేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో 8వ నెంబర్ రేషన్ షాపులో 108 క్వింటాళ్ల బియ్యానికి సంబంధించి లెక్కలు రికార్డులు పూర్వకంగా సక్రమంగా లేకపోవడంతో షాపు యజమానిపై 6 ఏ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్ఓ చాముండేశ్వరి తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఓ ప్రసన్న లక్ష్మీదేవి, ఎంఎస్ఓ విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నూకరాజు కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల మృతి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్, వైసిపి నాయకులు తూతిక నూకరాజు కుటుంబ సభ్యులను మంగళవారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కట్టా రాజ బాబు, కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు ఒ ్ న ఒ ా ల సుబ్రహ్మణ్యేశ్వరరావ్, రాజశేఖర్, ఎం. ప్రకాష్, సహారా రమేష్, వాసంశెట్టి చిన్న, రజక సంఘం అధ్యక్షులు వీరేశ్వరపు ఏసుబాబు పాల్గొన్నారు.



నూకరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎలుకల నివారణలో
విద్యుత్ వినియోగించవద్దు

ప్రజాశక్తి - కాజులూరు

ఎలుకల నివారణలో విద్యుత్ వినియోగించరాదని మండల వ్యవసాయ అధికారి ఏ.అశోక్ తెలిపారు. మంగళవారం మండలంలోని సలపాక గ్రామంలో ఎఒ అశోక్ మాట్లాడుతూ రబీలో ఎలుకలను నివారించేందుకు విద్యుత్తు వైర్లు అమర్చి ఎలుకలను నివారించేందుకు కొందరు రైతులు చర్యలు తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్ తీగలు అమర్చడం చాలా ప్రమాదకరమని వెంటనే తొలగించకపోతే తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఎలుకల నివారణకు గురువారం నుండి బ్రోమో డైయాలిన్ మందును రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు శిరీష, రైతులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలో తృతీయ బహుమతి పొందిన బాలికల జుట్టు

రగ్బీలో గురజానపల్లి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి -కరప

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో గుజనాపల్లి విద్యార్థినులు ప్రతిభ కనబరచి తతీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం బిఆర్ వి ప్రసాద్‌రావు తెలిపారు. కర్నూలులో జనవరి 29 నుండి 31 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 17 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున ఆడిన పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, గురజానపల్లి విద్యార్థినులు జి.కృష్ణ తేజ, పి.సునంద తేజశ్రీ, వై.జ్యోతి చంద్రిక పాల్గొన్న జుట్టుకు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి పొందారు. కర్నూలు జిల్లాలో ప్రముఖ విద్యా సంస్థలు ఆదర్శ విద్యాలయ అధినేత తిమ్మయ్య షీల్డ్ అందించారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగలింగేశ్వరరావును, విద్యార్థినులను హెచ్ఎం బి ఆర్.వి.ప్రసాదరావు, విద్యా కమిటీ చైర్మన్ పబ్బినీడి వీరబాబు, గ్రామ సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఇవ్వల ప్రసాదరావు, వివి రమణమూర్తి, బి.ఎస్.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

టిడిపితోనే బిసిలకు సముచిత స్థానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తెలుగుదేశం పార్టీతోనె బలహీన వర్గాల అభివద్ధి సాధ్యమని ప్రతిపాది టిడిపి ఇన్‌ఛార్జ్ వరుకుల రాజా అన్నారు. ప్రతిపాడు మండలం ఏలూరుకి చెందిన సీనియర్ టిడిపి నేత రొంగల సత్యనారాయణను పార్టీ అధిష్టానం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసింది. ఈ మేరకు సత్యనారాయణను మంగళ వారం వరుపుల రాజా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు కోళ్ల ఫారాలు దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు కోళ్ల ఫారాలు దగ్ధమయ్యాయి. ఫారాల యజమాని రీసు సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మూడు లక్షల పైగా ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తు న్నారు. సంఘటనా స్థలాన్ని ప్రతిపాడు టిడిపి ఇన్చార్జ్ వరుపుల రాజా, టిడిపి శ్రేణులు చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.



పాలగుమ్మిలో వికలాంగునితో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ప్రజాసంక్షేమమే వైసిపి ప్రభుత్వం పాలన లక్ష్యమని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగళవారం మంత్రి అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి, చప్పిడివారిపాలెం, కంభంపాడు, పెద్ద పేట గ్రామాల్లో 'గడప..గడపకూ మన ప్రభుత్వం'లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పినిపే శ్రీకాంత్, పాలగుమ్మి గ్రామ సర్పంచ్ కూడుపూడి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కమిటీకి సత్కారం

ప్రజాశక్తి-మండపేట

నూతనంగా ఎన్నికైన జిల్లా విశ్వబ్రాహ్మణ నూతన కమిటీ కార్యవర్గం విన్నకోట రాధాకృష్ణ ప్రసాద్, కోటిపల్లి కృష్ణమాచార్యులు, దార్ల స్వామిలను జాతీయ బిసి సంఘం ఆధ్వర్యంలో స్థానిక కామాక్షి కల్యాణ మంటపంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలోబిసి సంఘ నాయకులు పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో
నిందితునికి 6నెలల జైలు

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితునికి మంగళవారం అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.శైలజ ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. ఉప్పలగుప్తం చీకట్లపాలెంకు చెందిన దుర్గకు అతని మేనమామ పుల్లయ్య నాయుడుతో వివాహమై మనస్పర్థలు వచ్చి 15 ఏళ్ల క్రితం విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. అదే పంచాయతీ బడుగువారిపేటకు చెందిన కుంచే లక్ష్మణరావుతో దుర్గకు పరిచయం ఏర్పడి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి దుర్గతోపాటు ఆమె ఇద్దరు కుమార్తెల బాగోగులను లక్ష్మణరావు చూసుకునేవాడు. అయితే దుర్గ పై అనుమానం పెంచుకున్న లక్ష్మణరావు ఆమెతో మనస్పర్ధలు వచ్చి విడివిడిగా ఉంటున్నారు. తరచూ లక్ష్మణరావు దుర్గకు ఫోన్ చేసి బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో 2020 జనవరి16న లక్ష్మణరావు దుర్గ ఇంటికి వచ్చి కత్తితో దుర్గపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దుర్గ చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చేరింది. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు అప్పటి ఎస్ఐ కె.సురేష్ బాబు కేసు నమోదు చేసి లక్ష్మణరావు ని అరెస్టు చేసి అమ లాపురం కోర్టులో హాజరు పరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.శైలజ పై విధంగా తీర్పు వెలువరించారు.

ప్రయోజనకర ప్రణాళికలు అమలు చేయండి

- మార్టేరు వ్యవసాయ సహ సంచాలకులు డాక్టర్ భరత్ లక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే రోజుల్లో రైతులకు అధిక దిగుబడులు, అధిక ఆదాయం లభించే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని మారిటేరు వ్యవసాయ సహా పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం భరత్ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో అభ్యుదయ రైతులతో ఏర్పాటుచేసిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి ప్రసంగిం చారు. ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని, రైతులకు ఉపయుక్తమైన సలహాలను అందించడమే కాకుండా వారి కమతాల్లోనే వ్యవసాయ పరిశోధనలను ప్రయోగా త్మకంగా అమలు చేసి అవగాహన కల్పిస్తున్నార న్నారు. కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.ముకుందరావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రాంతాలలో వాతావరణ పరిస్థితులు, చీడపీడలు, ముంపును తట్టుకునే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర ప్రదర్శనలు చేపట్టాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ వి నరసింహారావు మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి ఏరువాక కేంద్రం విస్తరణ ప్రయోగాల ఫలితాలను సభకు నివేదించారు.



జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ భరత్ లక్ష్మి

రైతులకు ప్రయోజనం కలిగే రీతిలో శిక్షణ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ డైరెక్టర్ బివి రమణ,ఆత్మ పిడి జ్యోతిర్మయి ప్రసంగించారు.

రాజవరంలో గడప... గడపకూ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రాజవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ మంగళ వారం గ్రామంలో వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పలు నివాసాలకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు జడ్పిటిసి గొల్లు లక్ష్మణ మూర్తి, వైసిపి మండల అధ్యక్షులు శ్రీను, ఎంపీటీసీ సోమరౌతు సీతారామ స్వామి, ఎంపీడీవో ఎం.గోవిందు స్థానిక నాయకులు సోమరౌతు తిరుమల వెంకన్నదొర ఉన్నారు.

రాష్ట్రస్థాయి సిఎం కప్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎపి క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల నిర్వహించనున్న ఎ.పి.సి.ఎం.కప్ రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుంచి పాల్గొనడానికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కాకినాడ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో 18 సంవత్సరాల పైబడి 35సం.ల లోపు పురుషులకు, మహిళలకు హాకీ, కబడ్డీ, ఫుట్ బాల్, ఖోఖో క్రీడలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. టెన్నిస్‌లో ఐదుగురు పురుషులు, ముగ్గురు మహిళలు, క్రికెట్ టీమ్‌కు 15 మంది పురుషులు, ఫుట్ బాల్ టీమ్‌కు 18 మంది పురుషులు, కబడ్డీ టీమ్‌కు వీరిలో 12 మంది పురుషులు 9 మంది మహిళలు, ఖోఖో టీమ్‌కు 12 మంది పురుషులు, 12 మంది మహిళలు, హాకీ టీమ్‌కు 18 మంది పురుషులు, 18 మంది మహిళలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఎంపికలను హాకీ క్రీడాకారులను కాకినాడ జిల్లా పి.ఇ.టి అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా హాకీ అసోసియెషన్ కన్వీనర్ రవిరాజు, ఖోఖో, కబడ్డీ క్రీడాకారులను జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కె.పట్టాభిరామం, తూర్పుగోదావరి జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు డి.ఎం.ఎం.శేషగిరి ఎంపిక చేశారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ఆయా క్రీడల కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.




కబడ్డీ పోటీల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతే!

ప్రజాశక్తి -కరప

అమరావతి ఎప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి అన్నారు. విజయరాయుడు పాలెంలో మంగళవారం ఇంటింటికి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తితో కలిసి నిర్వహించారు. అమరావతే రాజధాని అని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చా రన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అంటే సీఎం జగన్‌కు లెక్క లేదన్నారు. రాజధాని విషయంలో కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా వైసిపి చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గుల్లిపల్లి శ్రీనివాసరావు, బుంగా సింహాద్రి నాయకులు మాతా అబ్బాయి, మాదాసు ప్రసాద్, ఈశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



విజయరాయుడుపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ పిల్లి అనంతలక్ష్మి

జాబ్‌మేళాలో 11 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట టీటీడీసీలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 11 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సీడాప్, ఏపి ఎస్ ఎస్ డి సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కు 32 మంది హాజరు కగా 11 మంది అర్హత సాధించారు.. డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీకి ఇద్దరు, శ్రీ గోపాల్ ఆటోమేటిక్ లిమిటెడ్‌కు నలుగురు, బ్లూ ఒసియన్ కంపెనీకి అయిదుగురు చొప్పున యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాలో జిల్లా జాబ్స్ మేనేజర్ కేశవరావు, డిఎస్డివో హరి శేషు, ప్లేస్ మెంట్ కో అర్డినేటర్ చంద్రరాజు, శ్యామ్, కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు.

విజయ బ్యాంక్ మేనేజర్‌కు జైలు, జరిమానా

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న విజయ బ్యాంక్ మేనేజర్ పాలంకి రఘురామ్‌కు రెండు సంవత్సరాలు జైలు, రూ.10వేలు జరిమాపా విధిస్తూ ముమ్మిడివరం మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఐ.పోలవరం ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. వివరాలు ఇవి 1995 మే31 నుంచి నుంచి 1997 మే 30 మధ్య కాలంలో ఐ.పోలవరం విజయ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పాలంకి రఘురామ్, 9 మంది కలిసి బ్యాంక్ రికార్డులను తారు మారుచేసి, తప్పుడు పట్టాల నెంబర్లు రశీదులు పొంది 95మంది పంట లోన్లు మంజూరు చేశారని, అప్పటి బ్యాంక్ మేనేజర్ ముత్యాల రాజేంద్ర ప్రసాద్ 9సెప్టెంబరు 2000 సంవత్సరం సెప్టెంబర్ 9న ఐ.పోలవరం ఎస్ఐ యు.మార్తాండరావు కు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి ముమ్మిడివరం సిఐ బండారు గురునాథం, జె ప్రభాకరరావు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. అయితే కేసు వాదోపవాదాల అనంతరం ప్రథమ నిందితుడు అయిన పాలంకి రఘు రామ్‌కు రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా, జరిమానా కట్టక పోతే అదనంగా 2 నెలలు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. కేసు లో ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి జి.విజయ, ఎస్.రాధిక, సిహెచ్. రాజశేఖర్ వాదనలు వినిపించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-మండపేట

రాయవరంలో రామయ్య జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జెడ్‌పిటసి సభ్యురాలు మంగతాయారు, ఎంపిపి నౌడు వెంకటరమణ, ఎంపిడిఒ శ్రీనివాసరావులు స్టడీ మెటీరియల్ ను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పప్పు శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

వెండి కలశాల బహూకరణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగరలో వేంకటేశ్వర స్వామి ఆలయానికి దాతలు 9 వెండి కలశాలు మంగళవారం బహూకరించారు. వెంకటేశ్వర స్వామి అష్టమి బ్రహ్మోత్సవాలు సందర్భంగా పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మంది దాతలు స్వామివారికి వెండి కలశాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కె. బాల బాలాజీ ఆధ్వర్యంలో కలశ, విశేష పూజలు నిర్వహించారు.

గెయిల్ పైప్‌లైన్ల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

మోదుకూరులో గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు సహజవాయువు పైప్లైన్లు వాటి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం బుర్రకథ నిర్వాహకులు గొర్రెల రాము, కష్ణ సోదరులు సహజవాయువు పైప్లైన్లు వాటి రక్షణకు అమర్చిన వాల్వులు, వివిధ యంత్రాలు, హెచ్చరిక బోర్డులు, చిహ్నాలను సూచించే స్తంభాలను అందరూ రక్షించుకోవాలని తెలిపారు. వీటిని పాడు చేయకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఇందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను బుర్రకథ ద్వారా తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

చేపల చెరువులో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండల పరిధి పటవల గ్రామానికి చెందిన నామ శివబాబు (30) ప్రమాదవశాత్తు చేపల చెరువులో పడి మతి చెందినట్లు కోరింగ్ ఎస్ఐ నివాస కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన శివబాబు పశువులను మేపుకునేందుకు సమీపంలోని చేపల చెరువు వద్దకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో ప్రమాద వశాత్తు అదుపుతప్పి చెరువులో పడిపోయి ఉంటాడని భావిస్తున్నా మన్నారు. శివబాబు చెప్పులు చెరువులో తేలుతుండడంతో స్థానికులు విఆర్ఒకు సమాచారం అందజేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాస్ కుమార్ తెలిపారు.